పేదలపై నూనె ధరల భారం

వంట నూనెల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల కిందట ధరలకు, ఇప్పటి ధరలకు పొంతన లేకుండా పోయింది. లీటరుకు ఒక్కో నూనె ధర రూ.35 నుంచి రూ.40 వరకు పెరిగింది. వీటికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరగడంతో పేదోడి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని సామాన్యుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ వంటి వంట నూనెల ధరలు పోటీపడి పెరుగుతుండటంతో వాటిని కొనుగోలు చేయడానికి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

- నాలుగు నెలల్లోనే భారీగా పెరుగుదల
- లీటరుకు రూ.35 నుంచి రూ.40 వరకు పెరిగిన వైనం
- పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా 95 వేల కుటుంబాలుండగా దాదాపు 3 లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రతి కుటుంబానికి నెలకు రెండు నుంచి మూడు లీటర్ల వంట నూనె అవసరం. వీటితో పాటు నూనె ఆధారంగా తినుబండారాలు తయారు చేసి అమ్మకాలు చేపడుతున్న వారితో కలిపి సగటున నియోజకవర్గంలో నెలకు రెండు లక్షల లీటర్లకు పైగానే నూనె వాడకం ఉంటుంది. సామాన్యులకు అందనంత ఎత్తులో వంట నూనెల ధరలు ఉండటంతో వినియోగదారులు హడలిపోతున్నారు. ఓ వైపు వంట నూనె ధరలు మండిపోతుంటే మరోవైపు కూరగాయల ధరలు అదే స్థాయిలో ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లే ప్రతి వినియోగదారుడి జేబుకు చిల్లులు పడుతున్నాయి. వంట నూనెలపై దిగుమతి సుంకాలు 20 శాతానికి పెంచడంతో వాటి ధరలు సామాన్యుడికి అందకుండా పోతున్నాయని పేద, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు.



ధరల నియంత్రణ హామీ ఏమైంది?

తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలను నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలా ధరలు మండిపోతున్నాయని విమర్శిస్తున్నారు. వంట నూనెల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచడంతో లీటరుకు దాదాపు రూ.40 వరకు పెరిగిందని ధ్వజమెత్తుతున్నారు. వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

వంట నూనె ధరలు ఇలా...

నూనె రకం	4 నెలల క్రితం ధర రూ.	ప్రస్తుతం ధర రూ.
పామాయిల్	95	135
సన్‌ఫ్లవర్	112	150
రైస్‌బ్రాన్	115	155
వేరుశనగ	160	200



కొనుగోలుకు ఆలోచిస్తున్నాం

నిత్యావసర సరుకుల ధరలు ఇంతలా ఎన్నడూ పెరగలేదు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, సంతృప్తిగా భోజనం చేయాలన్నా లెక్కలేసుకోవాల్సి వస్తోంది. వంట నూనె, కూరగాయలు కొనాలంటే ఆలోచించాల్సిన రోజులు వచ్చేశాయి. – బొల్లిపాం అరుణకుమారి, నూజివీడు



ధరలు భారీగా పెరిగాయి

మార్కెట్‌లో వంట నూనె ధరలు భారీగా పెరిగాయి. మూడు నెలల కిందట పామాయిల్ లీటరు రూ.95 ఉండేది. ఇప్పుడు రూ.135కు పెరిగింది. దీనికి తోడు అన్నిరకాల నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగాయి. – బేరారామ్, నూజివీడు

క్లుప్తంగా

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): టైలరింగ్ వృత్తితో మెండుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు మంగళవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజసేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కుట్టు మిషన్‌లు పొందిన మహిళలు టైలరింగ్‌తో తమ కుటుంబాలకు ఆర్థిక చేయూతగా నిలవాలని కోరారు. కూటమి నాయకులు రామినేని రాజా, కొమ్మూరి గోపాలరావు, సంస్థ కార్యదర్శి ఎం.సుమలత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ రవాణా రంగ కార్మికులు, డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 24న చేపట్టనున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. ఈ మేరకు స్థానిక ఆటో డ్రైవర్లతో కలిసి కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటో, లారీ, ట్యాక్సీ, ఇతర రవాణారంగ డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే ధ్యేయం



ఆగిరిపల్లి: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయమని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ మస్తానయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆగిరిపల్లి, ఈదర, నెక్కలం గొల్లగూడెం, ఎస్‌పేటలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి వారికి సారా వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం సారా రహిత ప్రచార రథంపై గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

చాట్రాయిలో 'పొలం పిలుస్తోంది'



చాట్రాయి: మొక్కజొన్న పంటను పరదాలపై ఆరబెట్టాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టార్పాలిన్‌పై ఎండబెట్టినప్పుడు విత్తనాల నాణ్యత పెరుగుతుందన్నారు. మొక్కజొన్న కోతల తరువాత చొప్పతో లోతు దుక్కులు దున్నడం వలన భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని, భూమిలో ఉండే పంటను నష్టపరిచే క్రిమికీటకాలు ఎండ తీవ్రతకు నశించి పోతాయని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో రైతుల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

జి.కొండూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు, రసాయనిక వ్యవసాయం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. లోపూడిలో మరీదు నాగేశ్వరరావు రహస్యంగా సారా విక్రయిస్తుండడంతో మంగళవారం అతడి ఇంటి వద్ద సోదాలు చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా సరఫరా చేస్తున్న చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడేనికి చెందిన ఇస్లావత్ గోపిపై కేసు నమోదు చేశారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

ముసునూరు: లోపూడిలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించి, గ్రామంలోని మూడు రేషన్ దుకాణాలను, స్టాక్‌ను తనిఖీ చేశారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేశారు. స్టాక్ నిర్వహణలో అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని, తేడాలు గమనిస్తే చర్యలు చేపడతామని డీలర్లను ఆయన హెచ్చరించారు.

పనివేళల్లో.. కార్యాలయాలకు తాళం!



తాళం వేసి ఉన్న కట్టుబడిపాలెం రైతు సేవా కేంద్రం



తాళం వేసి ఉన్న కట్టుబడిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్

జి.కొండూరు: గ్రామ స్వరాజ్యం దిశగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుంటే అధికారులు కూడా తామేమీ తక్కువ కాదన్నట్లు వ్యవరిస్తున్నారు. పని వేళల్లో కార్యాలయాలకు తాళాలు వేసి తమ సొంత పనులను చక్కబెట్టుకుంటున్నారు. మండల పరిధి కట్టుబడిపాలెం రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంగళవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో తాళాలు వేసి ఉన్నాయి. పనివేళల్లో కార్యాలయాలకు తాళాలు వేసి ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం ఆధునిక వసతులతో లక్షలు వెచ్చించి కార్యాలయాలు కట్టించి ఇస్తే అధికారులు నిర్లక్ష్యంగా కార్యాలయాలకు రాకుండా తమ సొంత పనులు చూసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనిభారం తగ్గించాలని వినతి



ఎంపీడీఓ సునీత శర్మకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీల కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎంపీడీఓ సునీత శర్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టార్గెట్‌లు పెట్టి పనిచేయించడం వలన పని ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ పంచాయతీల్లో అవసరాలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేరన్నారు. సరిపడా కార్మికులు లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు, తడి, పొడి చెత్త సేకరణ కార్యదర్శులకు భారంగా మారిందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు మునేశ్వరరావు, అనిల్, మురళి, మౌనిక, మాధవి, వెంకటేష్, శ్రీకాంత్, సరోజ, భాష తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ముసునూరు: రైతులు తమ పంటల పరిరక్షణ కోసం, ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.చినసూరిబాబు సూచించారు. కాట్రేనిపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్య నమోదు, సేద్యంలో మెలకువలు, ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను రైతులు తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని పంటల సమగ్ర సస్య రక్షణకు అవసరమైన వివరాలను తెలుసుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా, భూసార పరీక్షల వివరాలను రైతులకు తెలిపారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ కార్యక్రమాలు అభినందనీయం



ముసునూరు: మారుమూల పల్లెల్లోని యువతులు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి స్వయం ఉపాధితో అభివృద్ధి చేయడం అభినందనీయమని హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ జాతీయ ప్రావెన్షియల్ సుపీరియర్ జయమేరి అన్నారు. రమణక్కపేట హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సంస్థ సుపీరియర్ మేరీమెటిల్డా ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విజయవాడ మేత్రాసన ప్రొక్యురేటర్ ఫాదర్ ఆనంద్‌బాబు, బిషప్ కార్యదర్శి ఫాదర్ కుమార్‌రాజా చేతుల మీదుగా ఎనిమిది నెలలు శిక్షణ ముగించుకున్న 20 మంది యువతులు, మహిళలకు డిప్లమో సర్టిఫికెట్లతోపాటు కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రెనింగ్ ఇన్‌చార్జి సిస్టర్ మిల్‌రెడ్, టీచర్ మేరీ, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కోళ్ల ఫారం దగ్ధం

ఆగిరిపల్లి: అనంతసాగరం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో శృంగవరపు సత్యనారాయణ కోళ్ల ఫారం దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలకు కోళ్లు కూడా కాలిపోయాయని సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు సత్యనారాయణ తెలిపారు.

దివ్యాంగులను ఆదరించాలి



ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల ముందడుగు కోసం మన అండ దండలు, ఆదరణ అవసరమని హెచ్‌ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పాలడుగు జ్యోత్స్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ సునీతశర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు. కాగా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభం కార్యక్రమంలో ఎంఈఓ పుష్పలత, ఏఓ శైలజ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నూజివీడు: పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారుడు కొల్లా భావన్‌కు మంత్రి కొలుసు పార్థసారథి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని మంగళవారం తన ప్రతినిధులచే అందజేశారు. పట్టణంలోని కుమార్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొల్లా భావన్ దేశవ్యాప్తంగా ఉన్న చదరంగం క్రీడాకారుల్లో 2050 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచాడు. ఐదుసార్లు రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిన భావన్ ప్రతిభను గుర్తించి ప్రోత్సాహకాన్ని అతడి తల్లిదండ్రులు ఆంజనేయులు, వెంకట పూర్ణలకు అందించారు. చదరంగంలో మరింతగా రాణించి గ్రాండ్ మాస్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పిన్నమనేని వెంకటకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమావేశం

నూజివీడు: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈనెల 19న స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి బీజేపీ, టీడీపీ, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, జనసేన, సీపీఎం, ఆమ్‌ఆద్మీ, బీఎస్పీ తదితర పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

13 మంది జూదరుల అరెస్టు

నూజివీడు: మండలంలోని పోలసానపల్లి, రేగుంటలలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై నూజివీడు రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణ్‌బాబు సిబ్బందితో కలిసి పోలసానపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,210 స్వాధీనం చేసుకున్నారు. రేగుంటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,570 స్వాధీనం చేసుకొని 13 మందిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా పేకాట, కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే సెల్: 9440796440కు గాని, డయల్ 112కి గాని ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన



ఆగిరిపల్లి: తడి, పొడి చెత్త సేకరణపై మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆగిరిపల్లిలో పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం ప్రజల బాధ్యతగా భావించాలని సూచించారు.

21 నుంచి సువార్త మహాసభలు

మైలవరం: మైలవరం క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు క్రీస్తు సువార్త మహాసభలు జరుగుతాయని నిర్వాహకులు ఇందుపల్లి నవీన్ బాబు మంగళవారం తెలిపారు. మైలవరం లీడర్‌షిప్–2025 ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ వాక్యోపదేశకులు పాల్గొని దైవ సందేశమిస్తారని చెప్పారు.

● ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి జోగి రమేష్ మంగళవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిని ఆయన వివరించారు. – సాక్షి ప్రతినిధి

లకిరెడ్డి హనిమిరెడ్డి కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్



సర్టిఫికెట్లు అందుకుంటున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తదితరులు

మైలవరం: విద్యా వ్యవస్థలో సాధించే ప్రగతి దేశ నిర్మాణానికి పునాదులు వేస్తుందని ప్రవాసాంధ్రులు, మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించిన సందర్భంగా మంగళవారం ఆయన సర్టిఫికెట్‌లను స్వీకరించారు. డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతం పిల్లలందరూ ఏకాగ్రతతో చదువుకుని మంచి భవిష్యత్‌ను అందుకోవాలన్నారు. తద్వారా మైలవరం ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కళాశాలను సందర్శించి వివిధ రంగాల్లో కళాశాల కొనసాగిస్తున్న ప్రమాణాలను నిశితంగా పరిశీలించి ఐఎస్ఓ సర్టిఫికెట్‌లు ప్రదానం చేసిందని వివరించారు. సంస్థ అధినేత ఎ. శివయ్య మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, కళాశాల కో–ఆర్డినేటర్ బి. సుభాషిణి, ఎన్‌సీసీ ఆఫీసర్ జె.రాముడు, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ దేవానంద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేతకు పరామర్శ



గోగులంపాడులో నాగళ్లను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుని పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆకాంక్షించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, గోగులంపాడు వ్యవసాయ సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావును ఆయన పరామర్శించారు. గ్రామ సర్పంచ్ పిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పార్టీ నేతలతో కలిసి చింతలవల్లి శివారు గోగులంపాడులోని నాగళ్ల ఇంటికి చేరుకున్నారు. ఆయనను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ పిల్లి సుధాకర్, మాజీ సర్పంచ్‌లు రేగుల గోపాలకృష్ణ, పల్లెపాము కుటుంబరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి తొర్లపాటి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జిల్లా రైతు సంఘ సలహాదారుడు పల్లె రవీంద్రరెడ్డి, వార్డు సభ్యుడు పలగాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సూచన



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న హనుమంతరావు

తిరువూరు: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వద్దని ఎన్టీఆర్ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎం. హనుమంతరావు పశు యజమానులకు సూచించారు. తిరువూరు 20వ వార్డు, గంపలగూడెం మండలం అనుముల్లంక, తిరువూరు రూరల్ మండలంలోని చౌటపల్లి, మునుకుళ్ల, వావిలాల గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పశువులకు టీకాలు వేయించకపోతే వచ్చే ఇబ్బందులను వివరించారు. పశువులకు వేసవిలో తాగునీటి సదుపాయం కల్పించి వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తిరువూరు మండలంలోని వావిలాల పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరినందున ప్రత్యామ్నాయ చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. తిరువూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ సింగ్, పశు వైద్యాధికారులు అభిలాష్, స్వప్న, శ్వేత, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి గోపాలకృష్ణ, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

సీపీఎం నాయకుల డిమాండ్

మైలవరం: సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి, ఎం. మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు దాళ్వా పంట, మెట్ట పంటలను వేశారని, చెరువుల్లో నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ సమయంలో సాగర్ జలాల కోసం రైతులు, పశువుల యజమానులు ఎదురు చూస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం ప్రకారం ఏప్రిల్ నెలాఖరు వరకు సాగర్ జలాలు రావలసి ఉన్నప్పటికీ ఇంకా నీరు విడుదల చేయలేదని, కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వెంటనే సాగర్ జలాలను విడుదల చేయించాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ ఎం. సతీష్‌కుమార్‌కు నాయకులు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావును మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు ఇవ్వాలని, కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా ఐదో తేదీన జీతాల బిల్లులు అకౌంట్‌లో వేయాలని, వేసవి సెలవుల్లో పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఈఓ స్పందిస్తూ ఫిబ్రవరి వరకు జీతాల బిల్లులు పంపించామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు లక్ష్మి, జి. శ్రీలక్ష్మి, కౌశల్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అసభ్య ప్రవర్తన

జి.కొండూరు: మానసిక వికలాంగురాలైన బాలికపై తండ్రి వరసైన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై జి.కొండూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జి.కొండూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బి. రవీంద్రబాబు అనే వ్యక్తి విజయవాడకు చెందిన ఇద్దరు పిల్లలు ఉన్న మహిళతో గత ఐదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. కాగా రవీంద్రబాబు సదరు మహిళ కుమార్తె (11)తో సోమవారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇదే విషయం బాధిత బాలిక తల్లికి చెప్పడంతో జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉంటే నిందితుడు రవీంద్రబాబు సోమవారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనితో కుటుంబ సభ్యులు రవీంద్రబాబుని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.